

# ’అదే’ కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

### 48

### శుభ్రం

**అమెరికాలో చదువైపోయి** ఉద్యోగం రాగానే న్యూటన్ మూడో సూత్రం ప్రూవ్ చేయడానికి శ్రీకాంతారావు ఇండియావెళ్ళాడు. అలా అడుగుతారేంటండి, ఆమాత్రం తెలియదా? అమెరికా వచ్చిన ప్రతీ అబ్బాయి, అమ్మడు ఇండియా వెళ్ళి మరో అమ్మాయి, అబ్బాయిలని పెళ్ళిచేసుకుని (అదే ఏక్షన్ కి ఈక్వల్ అండ్ ఆపోజిట్ రియాక్షన్ అని న్యూటన్ మహాశయులు వచించినట్టూ) అమెరికా తీసుకొస్తారని కదా న్యూటన్ సిద్ధాంతీకరించేదు? అలా శ్రీకాంతారావు, ఉరఫ్ శ్రీకాంత్ పెళ్ళైనప్పుడు అత్తారింటికి వెళ్ళాడు వీలు చూసుకుని ఓ మూడురోజుల నిద్రకో మరోదానికో. అక్కడ కనిపించిన ఇంట్లో కొన్ని నచ్చాయి కొత్త పెళ్ళికూతురితో సహా. కానీ నచ్చనివి కొన్ని ఉన్నై. ఇంట్లో చీమలూ దోమలూ, కొండొకచో ఎలకలూ అవీ తిరుగుతున్నాయి. వర్షం వస్తే మరో కొన్ని రకాల చిన్నపాటి జీవులు ఇంట్లోకి వస్తూపోతూ ఉన్నాయి; అవి రావడం, పోవడం అలా ఉంచితే ఇంట్లోవాళ్ళకి ఇదేం పట్టినట్టూ లేదు.

అవి చూసి అడిగేడు అమ్మగారిని – “ఇదేమిటి మీ ఇంట్లో ఎవరూ శుభ్రంగా ఉండరా? ఇల్లు ఇలా ఉందేమిటి?” అంటూ.

“అబ్బే అదేం లేదు, మేము ఎంతో శుభ్రం. ఇప్పుడు పెళ్ళి వల్ల ఎవరికీ తీరిక లేక అలా ఉన్నాం అంతే.”

నిజమే కాబోలని ఊరుకున్నాడు పెళ్ళికొడుకు. ఏం చేస్తాడు ఊరుకోకపోతే?

ఆరునెలలు కిందా మీదా పడ్డాక అమ్మగారికి వీసా వచ్చింది. వచ్చిన తర్వాత ఏం జరుగుతుందో విదితమే కదా? చుట్టూ ఉన్న మనవాళ్ళు ఓ పార్టీ ఇస్తారు – అందరూ కలిసి ఓ బేనర్ – వెల్కం టు అమెరికా, నువ్వెంత గొప్పదానివో, వాహ్, ఆహా అంటూ. బీరు వరదలై పారుతుంది. అందులో కొత్త పెళ్ళికొడుకు కూడా తాగుతుంటే అమ్మగారికి కొంచెం కంగారు. "అబ్బే, బీరు లో ఉన్న ఆల్కహాల్ దగ్గుమందులో ఉన్నదానికంటే తక్కువ, ఏమీ కంగారు లేదు అయినా అమెరికా వచ్చి బీరైనా తాగని వాడూ ఒక మనిషే?" అంటూ అమ్మగారికి సర్ది చెప్పుట, పాట్ లక్కో, లేదా ఇండియా రెస్టారెంట్ నుంచి ఆర్డర్ చేసిన డిన్నర్, తర్వాత వీలు చూసుకుని మా ఇంటికి రండి అంటూ కొన్ని పిలుపులు, అలాగే తప్పక వస్తాం అంటూ ప్రామిస్ చేయుట, అప్పుడు గంట పదకొండు అవుతుంటే అందరూ వెళ్ళిపోయాక కొత్త దంపతుల తొలి అమెరికా ముచ్చటలు.

ఓ నాలుగు వారాలు గడిచాయి. కొత్తదనం పోయింది అమ్మగారికి. జెట్ లాగ్ కూడా పోయినట్టే. శ్రీకాంత్ అప్పుడు అడిగాడు అమ్మగారు (అయ్యో పేరు మర్చిపోయాం కదా, సులేఖ) ఏమి చేయబోతోందో? సులేఖ చదువుకున్నది ఎమ్ ఏ ఇంగ్లీషుట. అదెంతవరకూ అమెరికాలో పనికొస్తుందో ప్రస్తుతం తెలియదు. కనుక్కోవాలి పక్కనే ఉన్న కాలేజీలోనో యూనివర్సిటీలోనో. తర్వాత ఏదైనా కోర్స్ చేయుటయా, మానుటయా అనేది తేల్తుంది. ఈ లోపుల టోఫెల్ పరీక్ష రాయాల్సి రావచ్చు. ఇంకా ఏమేమి చేయాలో తెలియదు.

మరో రెండు నెలలకి అసలు విషయాలు తెల్సి వచ్చాయి అబ్బాయిగారికి.  అమ్మాయిగారికి ఏ పనీ చేయడానికి వళ్ళు వంగదు. వంట చేస్తారు కానీ రోజూ చేయరు ఇంట్లో ఉన్నా సరే. డిష్ వాషర్ లోడ్ చేయడానికి చిరాకు. అమెరికాలో ఇలా ఉంటుందని తెలియదు. ఇండియాలో అయితే అంట్లు బయట పారేస్తే పనిమనిషి వచ్చి కడిగేసి వెళ్ళిపోతుంది. ఇప్పుడు అన్నీ తానే చేసుకోవాలి.  ఉన్న రెండు బాత్రూంలలో ఒకటి అమ్మగారిది. అందులో ఆవిడ ఇష్టం వచ్చినట్టు బట్టలు పారేస్తూ ఉంటారు. నెలకో రోజు ఉతికే పని మీద బట్టలు ఉతికినా బాత్రూం మాత్రం దరిద్రం గా ఉంది. క్లీన్ గా ఉండొచ్చు కదా అంటే ఆవిడకి తీరికలేదుట. ఫోన్ చేయాలి ఇండియాకి; టోఫెల్ కి చదువుతున్నారు, ఈ లోపుల మరోసారీ మరోసారీ ఏదో పని. జీవితం వేస్ట్ అయిపోతోందని చింత. ఏ కోర్స్ చేస్తే ఏమౌతుందో అని మరో చింత. తనకొచ్చిన ఇంగ్లీషుతో ఓ సారి టోఫెల్ టెస్ట్ ప్రయత్నం చేసారుట ఇంట్లో; పాస్ కాలేదు అందువల్ల మరింత చింత.

శ్రీకాంత్ ఓ సారి సులేఖని కూర్చోపెట్టి చెప్పబోయేడు క్లీన్ గా ఉండడం సంగతి. అప్పుడు తెల్సిన విషయాల ప్రకారం అమ్మగారికి శుభ్రం అనేది ఏ కోశానా తెలియదు. ఇండియాలో అయితే ఆవిడ చదువుకుంటూంటే ఆవిడ తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ ఇల్లు సర్ది పెట్టేవారు. చీమలూ ఎలకలు తనకి వాళ్ళింట్లో కనబడినవి నిజంగానే సహజంగా ఉన్నవి. అప్పట్లో మేము శుభ్రంగానే ఉంటాం అని చెప్పినది తనని ఏమార్చడానికి. ఇప్పుడు అమెరికాలో ఈవిడ విశ్వరూపం

కనిపిస్తోంది. శ్రీకాంత్ ఇంక నోరుమూసుకుని తానే ఇల్లు శుభ్రం చేయడం మొదలుపెట్టాడు. కొన్నాళ్ళకి ఆ పని ఈయన చేతుల్లోకి వదిలేసి సులేఖ టివి చూడ్డం లేదా మరో పనిలో పడడం మొదలుపెట్టింది. మరో పని అంటే అడుగుతారేం? కంప్యూటర్ ఇంట్లో ఉంది ఇంటర్నెట్ తో సహా; అందులో పేకాట ఉచితం. లేదా ఏదో ఒకటి చేయొచ్చు. అంట్లు తోమడం, ఇల్లు సర్దడం కన్నా కంప్యూటర్ నేర్చుకోవడం మంచి పని కాదుటండీ? మరి ఇల్లు ఇలా ఉంటే ఎవరైనా వస్తే ఎలా? దానికో సులభమైన ఉపాయం కనిపెట్టారు అమ్మగారు.

శుక్రవారం లేదా శనివారం ఎవరినైనా భోజనాలకి పిలిస్తే పొద్దుటనుండీ శ్రీకాంత్ కి పని – కూరలు తరిగిపెట్టుట, షాపింగ్, తరిగేసిన కూరల తొక్కులూ అవీ తీసి, ట్రాష్ తీయడం డిష్ వాషర్ లోడ్ చేయుట, అలా వంటలో మరో చేయి వేయుట, ఈ పచ్చడి రుబ్బడానికి ఆ మిక్సర్ బయటకి తీయండి, మళ్ళీ లోపల పెట్టండి, వగైరాలు. గంటలో స్నేహితులు వస్తారనగా టివి రిమోట్ అమ్మగారు ఎక్కడపెట్టారో తెలియదు కనక దానికోసం వెదుకుట, హాల్, డైనింగ్ టేబిల్ అంతా సర్దడం, పక్కనే ఉన్న బాత్రూం లో అంతా సర్ది, మంచి సువాసన స్ప్రే కొట్టి నీట్ గా ఉంచడం అనే పనులు ఇంటాయనకి పురమాయించబడ్డాయి. లేదా అవి ఆయన చేయాల్సిన విషయాలు.

అలా ఇంటికి స్నేహితులు వచ్చేసరికి అప్పటివరకూ ఇద్దరూ ఎలా కొట్టుకున్నా తిట్టుకున్నా స్నేహితులముందు చిలగా గోరింకల్లాగా మొహాల మీద నవ్వులతో పలకరించడం – భోజనాలు;

"ఈ ఫలానా బాత్రూమ్ అమ్మగారిది దయచేసి అందులోకి వెళ్లకండి. ఈ పక్క బాత్రూమ్ ఉంది చూసారూ అదే బాగుంటుంది."

"వంట అయింది రండి తిందాం" లేదా

"ఇవిగో అపిటైజర్ లు". కోలా ఉండనే ఉంది;

"సారీ ఏమనుకోకండి అమ్మగారి ఆర్డర్ ప్రకారం బీరు మానడమైనది."

" ఇందులో ఉప్పు తక్కువ, ఇది బావుంది ఎలా చేసారు, మీ ఆవిడ వంట అద్భుతం – ఈ సారి మా ఇంట్లో పార్టీ అయినప్పుడు వచ్చి మీరు సహాయం చేయాలి (డేంజర్ సిగ్నల్ ఇవ్వబడింది; హతోస్మి)"

అనే కబుర్లతో పాటు మహేష్ బాబో వాడినాన్నో నటించిన నవ్వొచ్చే చిత్రం చూసి అంత్యాక్షరి లాంటి దరిద్రం ఒకటి అంటించి అంటించుకుని పార్టీకి గుడ్ బై చెప్పుట. స్వస్తి.

ఆ రాత్రి మళ్ళీ ఆలుమగలు గుసగుసలు.

"నీ మూలానే ఇలా అయింది నీకు శుభ్రం లేదు."

"నువ్వే అంతా నా జీవితం ఇలా అవడానిక్కారణం. లేకపోతే నేను ఇండియాలో ఎవర్నో హైద్రాబాదులో పెళ్ళిచేసుకుని పనిమనుషులతో పనులు చెయించుకుంటూ కాలుమీద కాలు వేసుకుని బతికేదాన్ని; ఇలా అంట్లు తోమే ప్రసక్తే లేదు."

"అయినా నువ్వు ఎందుకు క్లీన్ గా ఉండవు?"

"క్లీన్ గా ఉండకపోవడమేమిటి? నేను రోజూ స్నానం చేస్తా, మొహానికి పౌడర్లూ, క్రీములూ రాస్తా, అతి శుభ్రంగా ఉంటాను. మీలా రోజూ అదే జీన్ పేంట్ వేసుకుంటున్నానా? కనీసం వారానికి రెండుసార్లు షాంపూ వాటి జుట్టు శుభ్రంగా ఉంచుకుంటున్నా. బట్టలు క్లీన్ గా ఉంటాయి కూడా."

" అది కాదోయ్, నీ బాత్రూం చూడు; ఇంట్లో టేబుల్ చూసావా? ఆ కాయితాలు ఈ మురికి బట్టలు అక్కడ క్లోసెట్ లో కోట్లు అన్నీ ఎక్కడపడితే అక్కడ విసిరేసినట్టుంటాయి. వంటింట్లో ఏది కావాలన్నా కనిపించదు. అక్కడక్కడా చీమలు కనిపిస్తున్నాయి. ఒకసారి బొద్దింక కనిపించింది. అవి కానీ మనింట్లో తిష్ట వేస్తే మనం మరో అపార్ట్ మెంట్ చూసుకోవాల్సిందే. న్యూక్లియార్ బాంబ్ వేస్తే ప్రపంచ జనాభా మొత్తం చచ్చిపోయినా బొద్దింకలు మాత్రం బతుకుతాయిట. చూసుకో మరి."

"ఆ! గాడిదగుడ్డు అన్ని కబుర్లూ, సుత్తీ దేనికి మనం శుభ్రంగానే ఉన్నాంగా?"

శ్రీకాంత్ కి తిక్కరేగింది. ఏమి చేయలో తెలియలేదు కానీ ఆ రోజుకు నోరు మూసుకున్నాడు. మరో మూడు నెలలకి ఇదే తతంగం కొనసాగాక ఈ సారి చెప్పాడు సీరియస్ గా. కొంచెం గొడవ అవుతున్నట్టే లెక్క ఎందుకంటే పై అపార్ట్ మెంట్ లో ఉండే ఆయన ఓనర్ గారికి ఫోన్ చేసి చెప్పాడుట – వీళ్ళ ఆర్గ్యుమెంట్ల వల్ల ఆయనకి నిద్రాభంగం అవుతోంది. పునర్వతోస్మి, పునః పునః. చివరగా అయ్యగారికి జ్ఞానోదయం అయింది మరో మూడు నెలలకి అమ్మగారు నెల తప్పాకా, తనకి సంసార జంజాటం మరింత మెడకి తగులుకున్నాకా. అమ్మగారు మారడం అనేది కల్ల. "తాము" మారి, "తమ" ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడం అనేది "తమ" చేతుల్లో ఉందనుకున్నాడు ఇంతవరకూ. అది పూర్తిగా అసత్యం. ఈ ఇల్లు శుభ్రంగా ఉండడం అనేది దాదాపు అసంభవం. ఎవరైనా వస్తే "వాళ్ళ కోసం" తాము శుభ్రంగా ఉన్నట్టు కనిపించాలి గానీ రోజూ వారి శుభ్రంగా ఉండడం అనేది "తన" చేతులలో లేదు గాక లేదు. తాను ఎంత శుభ్రంగా ఉందా మనుకున్నా అది జరిగేదు కల్ల – ఎందుకంటే రెండు చేతులు కలిపితే కానీ చప్పట్లు రావు. అయితే తన చేతిలో ఉన్న ఆయుధం ఒకటే. ఎవరినీ ఇంటికి పిలవ వద్దు. వాళ్ళు రావడం, వాళ్ల కోసం తాను క్లీన్ చేయడం అనవసరం. తన ఇల్లు తాను ఉండడానికి క్లీన్ గా ఉంచుకోకపోతే, ఎవరో వచ్చే, పిలబోయే గెస్ట్, చుట్టాలకోసం శుభ్రం గా ఉండడం దేనికీ?

నీతి: ఇంట్లో శుభ్రంగా ఉండడం అనేది చిన్నప్పటినుండీ అలవడాలి, కానీ అమెరికా రాగానే ఒక్కసారి వచ్చేయదు.



Post your comments